# మరణం తరువాత ఏమి జరుగును!?



కె. తిరుపతి

# మరణం తరువాత ఏమి జరుగును?!

## తిరుపతి కాంబ్లే

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి, హైదరాబాద్,**

తెలంగాణ, ఇండియా

**మరణం తరువాత ఏమి జరుగును?!**

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2014

ప్రతులు : 1000

వెల : అమూల్యం

©సర్వహక్కులు రచయితవి

డిజైన్ & ప్రింటింగ్ : ఎ. శ్యాంసన్, 9550015417

రచయిత మరియు ప్రతులకు :

**బ్రదర్. తిరుపతి. కె**

ప్లాట్ నెం: 35, లహరి ఎన్‌క్లేవ్, ఉషోదయాకాలని,

గాజులరామారం, హైదరాబాద్ – 500055

సెల్ : +91 7893872620

వివరాలకు & ప్రతులకు :

**ఇన్‌స్టిట్యూట్ బైబిల్ టెక్నాలజి&చర్చ్,** హైదరాబాద్– 67

**Bro. J. Ravi**

H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet,

Hyderabad-500 016,

Cell : 9676744233, 9440792192, 9937592221

## ముందు మాట



క్రీస్తుయేసునందు ప్రియమైన దేవుని ప్రజలందరికి ప్రభువైన యేసు నామంలో వందనములు, శుభములు పలికి వ్రాయునది. దేవుని కృపామహ దైశ్వర్యమునుబట్టి, దేవుని కుమారుని సిలువ యాగాన్నిబట్టియు, దేవుని ఆత్మ సహవాసము, సహాయముబట్టి మన పరమ తండ్రియైన దేవదేవునికి స్తుతులు, స్తోత్రములు.

మనిషిగా మనం ఈ లోకానికి రావడం (పుట్టుక) మన చేతిలో లేదు. అదే విధముగా ఈ లోకాన్ని వదలి వెళ్ళడం (చావు) కూడా మన చేతిలో లేదు కదా. కాని ఈ ఆవిరి లేక నీటిబుడగలాంటి అతిచిన్న జీవితాన్ని రుచిచూశాక మాత్రం దీనిపై ఎనలేని ఆశలు, భవబంధాలు, మమతానురాగాలు పెంచుకొని ఇక్కడే శాశ్వతంగా ఉండిపోవాలనే ఆశయంతో రేపేమి సంభవిస్తుందోనని తెలుసుకోవడానికి, విశ్వప్రయత్నాలు చేస్తున్నాము.

మనకు రేపు అనేది గ్యారంటీ లేదని తెలిసినా మన తపన తప్పడం లేదు. రేపు అనేది ఉందనే ఆశతో ఎన్నో ముందస్తు ప్రణాళికలు వేసుకొనే మనము, మన ఈ బ్రతుకు తర్వాత అనగా మరణం తర్వాత మరో లోకం కూడా ఉన్నదని నమ్మకూడదా?

నమ్మితే నష్టమేమి లేదు కాని, నమ్మకపోతేనే నష్టమని సర్వోన్నతుడు, సర్వేశ్వరుడైన దేవోక్తి చెబుతుంది.

పుట్టుకతో పాటు చావుకూడా తప్పదు గనుక మన పుట్టుకకు ముందు మరియు చనిపోయిన తర్వాత ఏమి జరుగుతుంది అనేది మనలను పుట్టించి, గిట్టించేవాడే తెలియజేయాలి. గనుక ఆ దేవుని మాటలను మనకర్థమయ్యే రీతిలో బ్రదర్ తిరుపతి (జాషువా) తనకున్న జ్ఞానంతో చక్కగా వివరించాడు. ఇది సోదరుని ప్రారంభ రచన గనుక కేవలం కొన్ని మార్పులు, చేర్పులు చేసి సరిదిద్ది ప్రోత్సహించాను.

ఈ చిన్న పుస్తకాన్ని ఆసక్తితో చదివి, ఆలోచించి, గ్రహించి నేటికీ మానవ జ్ఞానానికి అందని మరణాంతర జీవిత రహస్యాన్ని, మరియు తిరిగి రాని లోకానికి తరలిపోయే ఈ ప్రయాణాన్ని అందరికి వివరిస్తారని మరియు ఈ పుస్తకాన్ని అందిస్తారని ఆశిస్తూ సోదరుడు తిరుపతి కాంబ్లేకి నా అభినందనలు తెలియజేస్తూ అతడు ఇంకా ఎన్నో రచనలు చేయాలని దేవున్ని ప్రార్థిస్తూ నా అభిప్రాయాన్ని మీకు తెలియజేసాను.

దేవుని కృపా సమాధానములు మనందరికి తోడై ఉండునుగాక... ఆమేన్

---

మరణించి తిరిగి లేచి మనందరికి మరో మంచి లోకాన్ని ప్రసాదించిన క్రీస్తు యేసు ప్రేమ పరిచర్యలో

**డా॥ బొంకూరి జాన్**

డైరెక్టర్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి, హైదరాబాద్.

## నా మాట

సర్వాధికారి, సర్వోన్నతుడు, సర్వశక్తిమంతుడైన దేవునికి స్తోత్రములు. క్రీస్తు దేవుని కుమారుడని నమ్మినవారికి, నమ్మని వారికి కూడా ప్రభువైన యేసునామంలో నా వందనములు.

దేవుని యొద్దనుండి ఈ లోకంలో ప్రవేశించిన ఆ మహానుభావుడైన యేసుక్రీస్తు తన జీవితకాలములో దేవుని యందు భయభక్తులతో, ఆయన నీతిని ధరించుకొని ఏ పాపం చేయకుండా పరిశుద్ధుడుగా జీవించి, అంధకార క్రియలలో ఉన్న మనందరి నిమిత్తము తన విలువైన రక్తాన్ని ఆఖరి బొట్టు కారినంత వరకు చిందించి సిలువపై మరణించి, మృత్యుంజయుడై మరణం తర్వాత ఏమి జరుగుతుందో తెలియజేసాడు.

ఏ పాపము లేని ఆ పావన మూర్తి, జాలి హృదయుడు, మనుష్యులందరి కొరకు చేసిన త్యాగం ఇంతా అంతా కాదు. మరణం తర్వాత ఏమి జరుగుతుందో తెలుసుకోవాలనుకొనే వారంతా ఆయన యొద్దకు తప్పనిసరిగా రావాలని చెప్పాడు (మత్తయి 11:28-30). ఈ జ్ఞానాన్ని డా॥ జానన్న చెప్పిన బైబిల్

క్లాసుల ద్వారా తెలుసుకొని, దేవుడు నాకిచ్చిన ఆత్మజ్ఞానాన్ని, ఆత్మ సహాయాన్ని మరియు నడిపింపును బట్టి ఈ చిన్న పుస్తకం వ్రాసి, ముద్రించి, మీకందించగలిగాను.

ఈ పుస్తక రచనలో నన్నెంతగానో ప్రోత్సహించి అనగా తప్పలు దిద్ది, మార్పులు - చేర్పులు చేసి ప్రింటింగ్ చేయించిన జానన్నకు ప్రత్యేకమైన హృదయపూర్వక వందనములు. మరియు ఐ.బి.టి. రవి అన్నకు, మిగతా ప్రిన్సిపాల్స్, నాతోటి విద్యార్థినీ, విద్యార్థులకు, సంఘస్తులకు ప్రత్యేక వందనములు. అందంగా డి.టి.పి. చేసి ముద్రించిన బ్రదర్ అంబడిపూడి శ్యాంసన్ గారికి వందనాలు.

జ్ఞానానికి మించిన క్రీస్తు ప్రేమను కలిగిన విశ్వ క్రైస్తవులందరికి నా పుస్తకాన్ని అంకితమిస్తూ... ఈ అంశం భూ లోకంలోని అందరికి అందాలని దేవున్ని ప్రార్థిస్తూ...

---

క్రీస్తు ప్రేమలో మీ సోదరుడు

**తిరుపతి కాంబ్లే**

# మరణం తరువాత
# ఏమి జరుగును?

**ఈ** లోకం పుట్టినది మొదలుకొని, నాటి రాతియుగం నుండి అభివృద్ధి చెంది మరియు చెందుతున్న నేటి నవీనయుగం వరకు అనేక తరాలు దాటాయి, దాటుతున్నాయి. ఇప్పటి వరకు అనేకులు పుట్టి చనిపోయారు ఇక ముందు కూడా చనిపోతారు. పాపము చేయటకు ఏ విధముగైతే ఏ బేధము లేదో మరణమునకు కూడా ఎలాంటి బేధములేదు. మనిషన్నప్పుడు దరిద్రుడైనా, ధనవంతుడైనా, చదువుల్లో విద్యావంతుడైన పాండిత్యుడైన, జ్ఞానియైనా కనీసం జ్ఞానం లేని అజ్ఞానియైనా, ఏ కులమైనా, ఏ మతానికి చేందినవాడైన ప్రతి వానిజీవితంలో మరణం రాక తప్పదు.

మనిషి ఎంత తప్పించుకున్నా ఎంత జాగ్రత్తపడినా రోజుకు 200 రూపాయలు సంపాదించే కూలివాని నుండి మంత్రిసీటుపై కూర్చున్న మంత్రియైనా, సింహాసనంపై

కూర్చొని రాజ్యాలను ఏలుతున్న ఏ రాజైనా, ఎంతటి బలవంతుడైనా లోకాలను ఏలుతున్న అధికారియైన ఎంతటి శూరుడైన వీరుడైనా మరణం నుండి తప్పించు కోలేడు / లేము. ఎందుకంటే మరణం మనిషికి దేవుడిచ్చిన వరము. జననం దేవుడిచ్చిన బహుమానమైతే మరణం కూడా దేవుడిచ్చిన గొప్ప వరము. అందుకే పుట్టిన ప్రతివాడు మరణిస్తున్నాడు. మరణంపేరుతో తిరిగిరాని లోకానికి శాశ్వతంగా వెళ్తున్నాడు.

మరణం అందరికి వస్తుందన్న విషయం ఎరిగిన మానవజాతి మరణించిపోయే వారి కొరకు ఆలోచించ లేకపోతుంది. ఒకవేళ ఆలోచన తట్టినా దేవుని దగ్గరకు పోయాడులే అని కొసరుగా కొంతమంది చెప్పడం అది విన్న ప్రతి మనిషి మరణమును సహజంగా తీసుకోవడం తరతరాలనుండి తరుచుగా జరుగుతుంది.

భూమిపై పుట్టిన లోకులందరు ఇలా పుట్టిపెరిగి, చదువుకొని వయసొచ్చాక పెళ్ళి చేసుకొని పిలల్లను కని వృద్ధాప్యంలోకి వచ్చి చివరికి మరణించి ఈలోకం నుండి

వెళ్ళిపోతున్నారు. ప్రతివాని అంతం ఇలాగే కొనసాగుతుంది. కాని ఏ ఒక్కరైన మరిణించిన వానిని చూసి పరిశీలన చేసుకొని వాడు శాశ్వతంగా ప్రయాణమై పోయే స్ధలం ఏది? అని వెదికి కనుక్కొనే వారు లేకపోయారు ఎందుకంటే మనిషిగా పుట్టిన ప్రతివాడు తన సొంత ఆలోచనతో తనకు నచ్చిన విధంగా బ్రతుకుతున్నాడు గనుక వాని పోకడ వానికి చిక్కడం లేదు. ఏందుకు చిక్కుతుంది.?

తన సొంత అలోచనలతో సృష్టించుకున్న కట్టుబాట్లను ఆదారంగా చేసుకొని మరణించాక భగవంతుని దగ్గరికే పోతామని చెప్పుకునేవారు కొందరైతే, మరణించిన తరువాత యమలోకానికి వెళతామని చెప్పేవారు కొంతమంది. ఇంకొందరు మరణం తరువాత మన ఆత్మ ఏదో ఒక జీవిలో ప్రవేశిస్తుందని చెప్పే వారుండగా కోరికలు తీరకపోతే దయ్యాలుగా మారుతారని చేప్పేవారు ఇంకొంతమంది. ఇకపోతే పండితులు అని పిలువబడుతున్నవారు

మరణించాక  ఏడుజన్మలు ఉంటాయని చెప్పుకునేవారు కొందరైతే పరకాయ ప్రవేశం కూడా ఉందని చెప్పుకునే స్వాములు  కొంతమంది. కాదుకాదు చచ్చాక గాలిలోకి కలిసిపోతామని చెప్పుకునేవారు కొంతమంది ఉండగా, లేదండి మరణించాక మట్టిలోనే మన్నైపోతామని చెప్పుకునేవారు ఇంకొంతమంది. మరణం గూర్చి అంతగా ఆలోచించని వారైతే మరణించాక ఎక్కడికి పోతామో ఎవరికి తెలుసు?  ఎవరైన చూశారా?  ఏంటి?  అని తమ సొంత ఆలోచన ప్రకారంగా చెప్పుకుంటూ గజిబిజిగా బ్రతుకుతున్నప్పుడు మనిషి తన శరీరాన్ని విడిచిన క్షణం ఎక్కడికి వెళ్తున్నాడన్న విషయం తన గందరగోళపు మేధస్సుకు ఎలా అందుతుంది?

మనుషులందరు ఇలా నానా విధాలుగా జీవిస్తున్నారు – గనుకనే మనిషి అంతం అయిన తరువాత తను వెళ్తున్న లోకం ఎరుగక  ఉన్నారు. ఎప్పుడైతే మనిషి తన సొంత ఆలోచనను కోరాడో అప్పుడే తన్నుతాను మరిచాడని చెప్పక తప్పదు. తాను తన సొంత ఆలోచనను కోరి సృష్టించుకున్న కట్టుబాట్లను ఆధారంగా చేసుకొని

వాటిని నమ్ముకొని జీవిస్తున్నాడు గనుక దేవుడిచ్చిన జన్మ అను బహుమానమును మరణం అను వరమును బొత్తిగా మరచి పోయాడు. ఇంతకి మానవుడు తన సొంత ఆలోచనను నమ్మి సృష్టించుకున్న కట్టుబాట్లు ఏంటి? అనే ప్రశ్నతో కూడినటువంటి సందేహం మీకు రావచ్చు. అయితే చదవండి.

ఆ పరమాత్ముని ఆత్మను కలిగి అద్భుతమైనవంటి శరీర ఆకారమును ధరించుకున్నవాడు, మాట్లాడటానికి ఏ జీవికి లేనటువంటి మంచినోరు, ఏ జీవికి లేనటువంటి చెవులు, ముక్కు మరియు అందమైనటువంటి కళ్ళతో నిర్మాణమైన ఆ ముఖం. నడిస్తే మంచి నడకగా వింతగా చలించే వానిగా ఇలా ఏ జీవికి లేనటువంటి వివేకముతో పాటు ఏ జీవి తీసుకోలేనటువంటి మంచి ఆహారం, ఏ జంతువు నిర్మించుకోలేనటువంటి మంచి నివాసమును నిర్మించుకొని నానా సమయములలో నానా విధాలుగా ఈ చరాచర జగత్తిని అనుభవిస్తూ ప్రకృతిపై సవారి చేస్తూ దేవుని స్వరూపమును కలగినవాడై ఉండి దేవుడు

సృష్టించిన ఈ సృష్టి అంతటిలో ప్రప్రథముగా కనిపిస్తున్న వాడే మానవుడు.

ఇలా దేవుడు సర్వమానవాళిని సమానంగా సృష్టించి తాను కలుగజేసిన సమస్తముపై సర్వ అధికారమును వినయంగా జీవించుటకు, స్వతంత్రమును ఇచ్చినప్పటికి కూడా జనన మరణాల మధ్య తమకున్న పాత్ర ఎట్టిదో గుర్తించక మనుషులు మనుషులుగా బ్రతకకుండ, జీవనమును గడుపుతున్న జనారణ్యానికి జీవమును గూర్చి తెలియకుండ అడ్డుగ ఉండి, ఒకటిగా జీవించక ఒకరిపై ఒకరు రెచ్చిపోతూ కరుచకొని విరుచుకొని దుమ్మెత్తిపోసుకునేలా పోరాటాలతో భీభత్సాన్ని సృష్టించే ఉద్యమాలతో నినాదాలతో, మోక్ష మార్గమును కనిపించకుండ ప్రజలందరి హృదయాలకు గ్రుడ్డి తనమును కలుగజేస్తున్నాడు.

ఇదే జీవితమనుకొని దేవుని ప్రతిరూపాలైన మానవకోటిని దారుణముగా నష్టపరచి అంతమయ్యేలా చేస్తున్న మనిషి మట్టి మెదడు నుండి పుట్టిన కట్టుబాట్లను

గూర్చి ఈ చిన్నపుస్తకంలో వ్రాయబడినవి. ఇందులో ఎవరిని విమర్శించక, వ్యతిరేకించక, ఆటంకపరచక కుల, మత, జాతి బేధము లేకుండ సర్వమానవాళి ఎన్ని వర్గాలుగా విడిపోయినా మరణం తరువాత అందరూ వెళ్ళవలసింది ఆపరమాత్ముడు తీర్చినతీర్పుకే అని వ్రాసిన ఈ అంశమును ముందుముందుగా ఈపుస్తకమును చదువుతున్న మీరే గ్రహించగలరు.

దేవునిచే ప్రత్యేకంగా సృష్టింపబడిన మానవుడు తను బ్రతకడానికి నాడు కేవలం రాతిని ఉపయోగించి నేడు రాకెట్ యుగం వరకు ఎదిగాడు. మొదటగా అలా రాతిని ఉపయోగించిన మనిషి రకరకాల పరికరాలను వాడుకుంటు అనేక పనులతో జీవనాన్ని సాగించడం ప్రారంభించి తాను చేయుచున్న పనికి "వృత్తి" అని పేరు పెట్టాడని తెలియని వారు ఏ ఒక్కరు లేరు. కాని దివారాత్రులు కష్టపడి చెమటకార్చి మంచి శైలితో చేసుకున్న తమ వృత్తిపై వ్యతిరేకమైన చీకటిముద్ర వేయించుకొని మనుషులుగా ప్రవర్ధించక వారిలో ఉన్న

దైవ స్వరూపాలను గుర్తించక దారుణంగా బలి అవుతున్నారన్న విషయం ఎంత మందికి తెలుసు**?** తెలిస్తే ఎంత మంది కళ్ళు తెరవగలరు**?**

ప్రతివాని జీవితంలో తన రోజునవారి జీవన ఫలమును సంపాదించడానికి శ్రమపడాలని నిర్ణయించుకున్న మనుషులు తమ జీవనమును సాగించుటకు భూమిని సేద్యపరిచేవానిగా (రైతుగా), చెప్పులుకుట్టి తయారుచేసి అమ్మేవారిగా, దుస్తులు తయారుచేసి అమ్మేవారిగా, మంచాలు, కుర్చీలు తయారు చేసే వారిగా, కుండలు తయారు చేసి అమ్మేవారిగా, బట్టలు ఉతికే వారిగా, ఇలా నానా విధాలుగా పనులను సృష్టించుకుని బ్రతకడం నేర్చుకున్నారు.

అందరు తమ తమవృత్తులతో పనులు చేసుకుంటు సమానంగా బ్రతకుతున్నప్పుడు మంచి తనంతో బ్రతకక తమతమ వృత్తులకు ప్రత్యేకమైన పేరుండాలని తమ వృత్తులను అడ్డుపెట్టి మాల, మాదిగ, కమ్మ, కాపు, కమ్మరి, కుమ్మరి, పద్మశాలి, కంసాలి, చాకలి, అంటు

అనేక కులాల పేర్లతో తమ వృత్తులపై ముద్రవేసుకొని ప్రతి కులానికి వేరు వేరు ఆచారాలు పద్దతులతో కట్టుబాట్లను సృష్టించుకున్నారు. మనుషులలో నుండి వేరై ఎన్నో వర్గాలుగా, మానవ మృగాలుగా జీవిస్తూ, ఎవరి గుంపుకు వారి నియమాలు, ఆచారాలు, పద్దతులే కాకుండ జీవన శైలిని కూడా మార్చుకొని, ఒక కులమంటే మరో కులానికి మధ్య బేధము తీసుకొచ్చి, ఒక కులమంటే మరో కులానికి పడక మనిషన్న మాటకు అర్ధాన్ని కోల్పోయి సాటి మానవున్ని విమర్శిస్తు, దూషిస్తూ ఒకరిపై ఒకరు కరుచుకొని విరచుకొని దుమ్మెత్తి పోసుకుంటు గొడవలకు దారితీసి సాటి మనుషులను దారుణంగా చంపేస్థితికి ఎదిగారు.

కాని ఒక్కక్షణం ఆలోచించి, మన పాదాలకి చెప్పులు, ఒంటికి దుస్తులు, మెడలో బంగారపుగొలుసు, పడుకోవడానికి మంచము, కూర్చోవడానికి కుర్చి, ఇలా అనేక విధాలుగా మన అవసరాలు తీర్చుకుంటున్నామంటే సాటి మానవుడు సృష్టించిన వృత్తిని బట్టే గదా! అని ఎవరు అనుకోరు. ఒక్కో మానవుడు ఒక్కొక్క వృత్తిని

సృష్టించకపోతే ఈ ప్రపంచమంత సకల అవసరాలు తీర్చుకొని ఈ రాకెట్ యుగంలో అడుగు పెట్టేదే కాదు. ఇలా ఆలోచించక మానవ మనుగడకు సంబంధించిన ప్రతి అవసరమును దర్జాగా తీర్చుకుంటున్నారీ నరులు.

నాకులం గొప్పది ఎదుటి వానికులం చెడ్డది అనే స్థితికి ఎదిగారంటే తమ తమ వృత్తులకు వ్యతిరేకమైన కులమనే చీకటి ముద్ర వేయించుకొని బలైపోబట్టే గదా! పైనున్న ఆకాశం, క్రిందనున్న భూమి, మనం పీల్చుకునే గాలి, త్రాగే నీరు, మండే అగ్ని ఇవే కాకుండ ప్రకృతిలోని ప్రతి వస్తువు ఒకటై సర్వమానవాళిని ఒకటిగా భావించి అన్ని రకాల అవసరాలతో అన్ని కాలాలతో పాటు ధాన్యపు పదార్థాలతో పోషిస్తున్నాయంటే అందరు ఒకటిగా బ్రతకాలనే గదా!

ఇలా మనసుతో ఆలోచించని మానవజాతి తన మట్టి మెదడును నమ్మి ఎవరి వర్గం వారిది, ఎవరి ఆచారాలు వారివి, ఎవరి నియమాలు వారివి, ఎవరి పద్దతులు వారివి, అంటూ తమ ఇష్టాన్ని కోరినప్పుడు

ఒకటిగా ఎలా జీవించగలరు? మరణంతో ముడిపడి ఉన్న తమ ప్రయాణంలో నిత్యజీవముందని ఎలా గ్రహించగలరు? అనేక వర్గాలుగా విడిపోయిన జనం తమలోని దైవ స్వరూపమును గుర్తించక దేవుని శక్తివంతమైన తీర్పును ఎరుగక ఇలాంటి కట్టుబాట్లను ఆదారం చేసుకొని చివరి వరకు కొనసాగుతూ వాటినే నమ్ముకుని మరణాన్ని కొరే స్థితికి దిగాజారుతుంటే దేవుని ప్రతిరూపాలైన మానవాత్మలు మరణించిన తరువాత వెళ్ళే ఆ వేదనకరమైన స్థలం ఎట్టిదో ఎలా తెలుసు కొనగలరు? ఎవరైనా చెప్పినా ఎలా వినగలరు?

అందరూ తమకునచ్చిన విధంగా జీవిస్తుంటే అంతు తెలియని మరణం ఈ మానవ మేధస్సుకు ఎలా అందగలదు? మనిషి బ్రతకడానికి అవసరమయ్యే ప్రతి వస్తువు మన అందుబాటులో ఉన్నప్పుడు బ్రతికించలేని మానవ కల్పిత కట్టడలు అడ్డొచ్చి మానవ సమాజాన్ని చీల్చేస్తుంటే ఎలా కనుక్కోగలరు? ఒకవేళ కనుక్కోవాలని తమ హృదయాలలో ప్రశ్నలు ఉదయించినా కేవలం ఒక కులమే కాదు ఇంక అనేక కట్టడలు మానవకోటి

జీవనయాత్రకు అడ్డుపడి అంధకారములోకి త్రోసి వేస్తున్నాయి. అలాంటి వాటిలో అనేక పారం పర్యాచారాలతో కట్టబడినటువంటి మరో కట్టడమే మతము.

మనిషిని అహంకార స్వభావంలోనికి పడత్రోసి సాటి మానవులను చిన్నచూపులతో చూస్తు తమంతట తాము హెచ్చించుకుంటు సమాజంలో ఐక్యముగలవారై ఉండక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకొని కక్షలు క్రోధములతో దారుణమైన బేధములను తీసుకొచ్చి మారణ ఆయుధాలతో మానవ బాంబులతో పసిపిల్లలపై కూడ కనీసం కనికరంచూపకుండ మనుష్యులను హతమార్చుకునేల చేసేదే మతం. ఇది కూడ మనిషి మట్టి మెదడు నుండి పుట్టినదే. నరుల మార్పునుకోరిన దేవాధిదేవుడు వారి హృదయకాఠిణ్యమును ఎరిగి నానా సమయములలో నానా విధాలుగా ఇచ్చిన తన ఆజ్ఞలను అర్థం చేసుకొనక తమ స్వబుద్ధిని కోరి మతమనే కట్టడగా మార్చుకొని మనుష్యులపట్ల దయలేకుండ చేసి మారణకాండాన్ని సృష్టిస్తుంది ఈ మట్టి మెదడు.

మన దేశంలో కూడ మతంపేరుతో మరో మతాన్ని కించపరుస్తూ హీనమైన మాటలతో చేదు వాఖ్యలతో ప్రసంగించినటువంటి మత నాయకుల ప్రేరేపించిన ప్రేరేపనకు గురై గుజరాత్, అస్సాం, ఒరిస్సా లాంటి రాష్ట్రాలలో కత్తులతో పసిపిల్లలను సైతం అతిదారుణంగా చంపి భయాందోళనను సృష్టించిందన్న విషయం మనందరికి తెలిసినదే. ఇలా మానవులంత తమ ఇష్టమైన కార్యములు చేస్తుండటముతో మరో వర్గానికి ఇష్టం లేకనే ప్రజలలో బిన్నమైన బేధాలు ఏర్పడుతున్నాయి. వృత్తిని అడ్డంపెట్టి కులం పేరుతో కుళ్ళిపోతున్న వర్గం ఉండగా దేవున్ని అడ్డంపెట్టి మతం పేరుతో మత్తులోపడి మతోన్మాదులుగా మారినవర్గం కూడ ఈ సమాజంలో దినదినాభివృద్ధి చెందుతుందనడంలో సందేహంలేదు.

కులమతాల అడ్డుగోడలతో ఇరుగుపొరుగు వారితో కూడా మనస్ఫూర్తిగా మాట్లాడని మహానుభావులు మనలోనే ఉన్నారు. ఇళ్ళు కొనాలన్నా లేక అద్దెకు తీసుకోవాలన్న తమ కులానికో లేక మతానికో చెందిన

వారి ప్రదేశాలను మాత్రమే ఏరి కోరి నివసించేవారు కూడా మనలో నుండి వేరైన వారే. మనకున్న శరీరాలు ఒక్కటే మనలో ప్రవహిస్తున్న రక్తం ఒక్కటి మనలో ఉన్న ఆత్మ ఒక్కటే అయినప్పుడు మనందరము ఒక్కటే మనందరిని సృష్టించిన దేవుడు ఒక్కడే అని ఆలోచించేవారు కరువయ్యారు. ఎందుకు ఆలోచిస్తారు? మనం నమ్ముకున్నది కేవలం కులాన్ని మతాన్ని మాత్రమేనా? ఇంతటితో సరిపెట్టుకుని ఉంటే బాగుండు. మరీ సరిపెట్టుకుందా? ఈ సమాజం? లేదే!

శరీర కోరికలపై అంతులేని ఆశయాలు కమ్ముకున్నట్టు పోయిపోయి ప్రాంతమును నమ్మి ప్రాంతము పేరుతో ఉద్యమాన్ని సృష్టించి, తమ ప్రాంతం తమకు కావాలని ధర్నాలుచేస్తూ ప్రభుత్వ బలగాలు నానా తిప్పలుపడి వాటిని ఆపడానికి ప్రయత్నించినా అధికారులను సైతం ఎదిరించి, బెదిరించి నినాదాలతో ఉద్యమాలతో పోరాడుతు హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడిన వారితో సహా ప్రజలలో ఆందోళన మాత్రమే కాక కుటుంబ సభ్యులతో పాటుగా అందరికి

మ్రింగలేనటువంటి చేదు దు:ఖాన్ని త్రాగించి శాంతిని సంపూర్ణంగా సమాధి చేసిన చరిత్ర కారులు కూడ మానవత్వాన్ని మరిచి మనిషి మట్టి మెదడు నుండి పుట్టిన కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంతీయ, భాషలనే కట్టుబాట్లకు బానిసైన అమాయకులే.

సొంతగడ్డపై పుట్టినందుకు ప్రజల మేలునుకోరి వారిని మంచి మార్గంలో నడిపించడంలో నైతిక విలువలను కాపాడటంలో పోరాడితే అర్థం ఉంది. దానివల్ల వారికి సహాయంతో పాటు ఎవరి ప్రాణాలకు ఏ హాని జరగకుండఉంటుంది. కాని మనవాళ్ళు పోరాడుతుంది ప్రజలకొరకా? ప్రజలకొరకైతే హత్యలు ఆత్మహత్యలతో అనేక మంది ప్రాణాలు ఎందుకుపోతాయి. మట్టి (ప్రాంతం) కొరకు పోరాడుతున్నారు గనుకనే అన్యాయంగా అతి త్వరలో మట్టిలో కలిసి దేవుని తీర్పుకు గురైపోతున్నారు. పుట్టించే అధికారం గిట్టించే అధికారం పైనున్న ఆ పరమాత్మునికే ఉన్నప్పుడు, గిట్టేంచే సమయం రాకముందే మరణమును గూర్చి తెలుసుకొనకుండ

మనకిష్టం వచ్చినట్టుచావును కోరిప్రాణాలుకోల్పోతే, దేవుని దగ్గరకే వెళతామా? లేక తిరిగిరాని వేదన కరమైన పాతాళానికి వెళతామా? అని మనలో ప్రశ్న ఎప్పుడైన ఉదయించిందా? మరోసారి ఆలోచించండి.

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుష లోయ్ అని చిన్నప్పటినుంచి మనం నేర్చుకుంటున్న పాఠంలో మనిషినిబట్టి ఆ ప్రాంతానికి దేశమని పేరు వచ్చిందేగాని ప్రాంతాన్నిబట్టి మనిషికి పేరు రాలేదన్న మంచి భావమును గ్రహించేవారు కరువయ్యారు. దేవుని ఆలోచనను వాక్యానుసారంగా గ్రహించేవారు లేరు గనుకనే ప్రపంచమంతట దేశవిభజన, సమాజ అభివృద్ధి, చదువు సంధ్యలు, నైతిక విలువలతో పాటు ఇంక అనేకమైనటు వంటి మేలులు మరియు కీడులు మనిషినిబట్టే జరిగాయని, ప్రపంచము ఖండాలుగా, దేశాలుగా, రాష్ట్రాలుగా, జిల్లాలుగా, చివరికి గ్రామాలుగా, గల్లీలుగా మనిషినిబట్టే విభజన చెంది పేరు పెట్టుకున్నాయని ప్రాంతంకంటే మనిషికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడినదని,

చాలా ప్రాంతాలకు మనుషులను బట్టి మనుషుల పేర్లే పెట్టబడినవి గానీ, ప్రాంతమును బట్టి మనుషుల పేర్లు పెట్టబడలేదని ఆలోచించేవారు నానాటికి కరువైపోయి మట్టికొరకు మానవ ధర్మాన్ని చెరిపే విరోధమైన కట్టడను నమ్మి నాశనం అయిపోతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

లోకం పుట్టినప్పట్టి నుండి ప్రజలకొరకు నియమింపబడ్డ సానుకూల రాజకీయ నాయకులు, పండితులు, రచయితలు, లోకజ్ఞానులు కవులు ఇంక అనేక మంది ప్రజల జీవన మార్గముకొరకు ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారిని జీవనయానంలో సరిగ్గా నడిపించడానికి పోరాడారు గనుక నేడు మనం నివసిస్తున్న అనేక ప్రాంతాలకు వ్యక్తుల పేర్లే పెట్టబడ్డాయి. ఎలాగంటారా? మన దేశాన్ని భరతుడు అనే ఒకరాజు పరిపాలించాడు గనుక మనదేశానికి భారతదేశం అని అలాగే మన రాష్ట్ర రాజధానికి హైదరాబాద్ అని పేరు రాకముందు ఆ ప్రాంతాన్నిహైదర్ అలీ పరిపాలించాడు

గనుక దానికి హైదరాబాద్ అని ఇంకా ఆదిలాబాద్, నిజామాబాద్, జహీరాబాద్, వికారాబాద్, ఆహ్మోదాబాద్ లాంటి ప్రదేశాలను "బాద్ షా" వర్గానికి చెందిన వారు పరిపాలించారు గనుక ఆ ప్రాంతాల పేర్ల చివరి అక్షరాల్లో "బాద్" అని పెట్టబడింది.

అంతెందుకు మనం నివసిస్తున్న ప్రతిఊళ్లో అంబేద్కర్ చౌక్ గాంధీచౌక్, నేతాజిచౌక్, నెహ్రుచౌక్, శివాజిచౌక్ అని రకరకాలుగా ప్రజల భవిష్యత్ కోరి ప్రజలను ఏలిన దేశపౌరులైన మనుషుల పేర్లే పెట్టబడ్డాయి. అందుకే ప్రతి జయంతి, వర్ధంతి,స్వతంత్ర, గణతంత్ర, పుట్టినరోజు లాంటి అనేక కార్యక్రమాలకు వ్యక్తుల పేర్లతో జరుపుకోవడం తరాతరాల నుండి మనమంత తరుచుగా చూస్తు ఈనవీన యుగంలో అడుగు పెట్టామన్నది నగ్నసత్యముగాను, కళ్ళకు కట్టినట్లుగా ఉన్నప్పటికీ కూడా మనుషుల మనస్తత్వం వారి మనోభావాలను గుర్తించక మనిషికి ఇచ్చే ప్రాధాన్యత ఇవ్వక ఆ ప్రాంతానికిచ్చి ప్రాంతీయత ఆ పేరుతో

భయాందోళనను రేపుతూ ప్రాణాలు కోల్పోతూ దేవుని తీర్పుకు గురైపోతుంది సమాజం.

ఎవరికి వారే తమ స్వకీయ బుద్ధితో కులాలుగా, మతాలుగా, ప్రాంతబేదాలుగా విడిపోయి తమను తాము ఘనత వహించుకొని కేవలం తమ స్వజనుల దృష్టిలో ప్రతి జీవాత్ముడు స్వర్గస్తుడే అయినట్టు కొంతమంది మంచి వ్యాఖ్యలతో వ్రాతలు వ్రాసి మరణించినవారి పేర్లను అడ్డుపెట్టి వర్థంతీలు జరుపుకుంటు స్వర్గస్తులయ్యారు అని మాస, వార, దినప్రతికలలో టీ.వి ఛానల్‌ల్లో ప్రకటిస్తున్నారు. అన్ని విధాలైనటువంటి ఆచారాలతో కట్టబడి ఉన్న కట్టడలనుమనమే సృష్టించుకొని మరణం తరువాత వెళ్ళబోయే లోకం గూర్చి కూడా మనమే మనకిష్టం వచ్చినట్టు ప్రకటించుకుంటున్నాము.

లోకమును సృష్టించిన ఆదేవుని సంకల్పము, ఆయన (నిత్య)శక్తి, ప్రేమ, అతి పరిశుద్ధతను ఈ సమాజం ఆలోచించక దేవుని బహుమానముగా ఇవ్వబడినటువంటి మన జన్మను వరముగా ఇయ్యబడిన మరణమును

గుర్తించక అన్యాయం అయిపోతుందని మనుషులు తాము నమ్మిన మానవత్వానికి విరోధమైన స్వబుద్ధినిబట్టి చెప్పవచ్చు, ఇలా బ్రతుకుతున్న మానవాళి జీవితాలను పరిశీలనగా చేసుకొని ఆలోచిస్తే మానవులు తమ స్వకీయ దురాశలతో ఈ లోక జ్ఞానాన్ని నమ్మి ఎంతో విలువైన జీవమార్గమును కనిపెట్టక నిత్య పాతాళానికి గురై పోతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎందుకు పుట్టాము? ఎందుకు పెరిగాము? ఎందుకు చనిపోతున్నాము? చనిపోయాక ఎక్కడి వెళ్తున్నాము? అను ప్రశ్నలతో మేధస్సును ఉదయించు కొనక శరీరాశ, నేత్రాశ జీవపుడంబములతో స్నేహం చేసి గాలికి కొట్టుకొని పోయినట్టు ఇంతలో కనబడి అంతలో మాయమైపోయే గజిబిజి మార్గాలలో జీవిస్తు అంతమైపోతున్నారు. గనుకనే మానవుని ఆత్మ పోకడ ఎవరికి చిక్కక తమ హృయాలకు సరిగ్గ గోచరం కాక చనిపోయాక స్వర్గస్తులయ్యారని, ఏడు జన్మలు ఉంటాయని, ఏదో ఒక జీవిలో పుడుతామని, దయ్యాలుగా మారుతామని, పరకాయ ప్రదేశముందని, గాలిలో కలిసిపోతామని, లేదా మట్టిలో మన్నైపోతామని

ఇలా ఎవరి పాట వారే పాడుతున్నారు. అందరు దేవుడొక్కడే అని అంటారు కాని ఆ దేవున్ని చేరే మార్గం విషయంలో ఒక్కటికాలేక పోవడమే దురదృష్టకరం.

దేవుడు తాను సృష్టించిన యావత్తులో మనిషిని ఎంత గొప్పవానిగైతే ఎంత ప్రప్రథమునిగానైతే సృషించాడో, మనిషి అంతకంటే ఎక్కువ గర్వాంధుడై దుర్మార్గమైన హేయమునకు గురైపోయాడు. దేవుడు అన్ని జీవరాశు లకంటే ఎంతో అద్భుతమైన నిర్మాణంతో నిర్మించి బుద్ధి, తెలివి, వివేకముతో పాటు తన స్వరూపమునుకూడా ఇచ్చి ఏ జీవికి ఇవ్వలేనటువంటి మంచి ఆహారమును మంచి నివాసమును దయచేసి తాను సృషించిన సమస్తమును లోబరుచుకునే శక్తినిచ్చి ప్రకృతిలోని అన్నింటిని మానవుని పాదాలక్రింద పెట్టి సమస్త పక్షులు, జలచర జీవులు, జంతువులు, మృగాలకు సైతం మనిషి ముందు లోబడే గుణమునుఇచ్చి అందరిని సమానముగా పోషిస్తునప్పుడు కూడా మనిషి తన్ను సృష్టించిన ఆ దేవున్ని, తన కారణ జన్మను కనుక్కొనలేక మరణము తరువాత వెళ్ళబోయే

ఆతిరిగిరాని లోకమును గూర్చి తెలుసుకొన కుండ మృగము కంటే భయంకరంగా ప్రవర్తిస్తు అర్థం చేసుకోలే నప్పుడు తనను తాను ఎలా మేల్కోల్పగలడు?

నాడు రాతిని ఉపయోగించిన మానవుడు రాకెట్ యుగంలో అడుగుపెట్టి విశ్వపు అంచును తాకడానికి ఎన్నో ప్రయోగాలతో గ్రహాలలో సైతం అడుగు పెడుతున్నాడు అంటే దేవుడు మనిషిని ఎలా నిర్మించాడో అలోచించండి. కుక్కకి పుట్టిన పిల్లకి కుక్క రూపం, పిల్లికి పుట్టిన పిల్లకి పిల్లి రూపం, గాడిదకి పుట్టిన పిల్లకి గాడిద రూపం ఇలా ఏజీవికి పుట్టిన పిల్లకి దాని రూపమే రావడం ప్రకృతి ధర్మమైతే దేవునికి దేవుని మూలముగా పుట్టిన తన పిల్లలైనమానవులకు దేవుని స్వరూపం మరియు క్రీస్తు పోలిక రావాలని ఆ దేవుడు కోరుకోవడం దేవుని ధర్మము దేవుని కోరిక న్యాంయ కాదంటారా?

ఇందులో దేవుని ధర్మము, కోరిక మరియు ఇష్టం ఉంది గనుకనే నాడు కారడవిగా ఉన్న ఈ ప్రంపంచానికి చక్కని ఆకృతినిచ్చి కంప్యూటర్ యుగంగా మార్చాడు

మనిషి. దేవుడు జీవమున్న పక్షిని సృష్టిస్తే ఆ పక్షిని చూసిన మనషి నిర్జీవమైన ఎగిరే విమానాన్ని సృష్టించాడు. దేవుడు జీవమున్న మనిషిని సృష్టిస్తే మనిషి తనలాంటి రోబోను తయారుచేసాడు.  దేవుడు జీవమున్నజెర్రిని సృష్టిస్తే, దాన్ని చూసినమనిషి జీవము లేని రైలును కనిపెట్టాడు. దేవుడు జీవమున్న  తాబేలును సృషిస్తే, ఆ తాబేలునుచూసి జీవంలేని ప్రొక్లిన్ సృష్టించాడు మనిషి. మానవ మనుగడకు అవసరమయ్యే ప్రతి వస్తువును ప్రతి జీవినిచూసి కనిపెట్టిన మనిషిలో పరమాత్ముని స్వరూపము, పోలిక ఉండబట్టే గదా!  దేవుడు సృష్టించిన సమస్తమును మనిషి పాదముల క్రింద పెట్టాడు, గనుకనే సృష్టికి ప్రతి సృష్టి చేయగలుగుతున్నాడు.

రాజు కుమారుడు రాజుగా బ్రతకాలన్నది, రాజుకోర్కైతే దేవుని కుమారుడైన మానవుడు దేవునిగా బ్రతకాలన్నదే దేవుని కోరిక. ఒక్క రాజ్యాన్ని పరిపాలించే రాజుకే అంతటి కోరిక ఉన్నప్పుడు ఈ మహావిశ్వాన్ని కేవలం తన మాట ద్వారా సృష్టించిన ముల్లోకాల మహా

చక్రవర్తియైన దేవునికి తన కుమారులైన మరియు కుమార్తెలైన మనుషులపట్ల ఎంత కోరిక ఉండాలి? ఇలా గమనించని దేవుని ఆలయమైన మానవ జాతి తమకిచ్చిన దైవ స్వరూపమైన “ఆత్మను” గుర్తించక మానవ కల్పిత కట్టడ లోయలో పడి ఒకరంటే ఒకరికి పడక కరుచుకొని విరుచుకొని దుమ్మెత్తి పోసుకుంటు మానవజన్మకు అర్థాన్ని కోల్పోయి మరణిస్తుంది. ఇక ఎన్నటికి తిరిగిరాని వేదన కరమైన అగ్నిగుండమైన పాతాళానికి (నరకానికి) జారిపోతుంది.

కోటి విద్యలు కూటికొరకని ఎంత చదివినా లోక జ్ఞానాన్ని ఎంత పఠించినా తనుమరణం తరువాత వెళ్ళబోయే లోకం గూర్చి తెలుసుకొక పోతే మానవ జన్మకు అర్థం తెలియనట్టే! మనిషి పుట్టింది కేవలం బ్రతికి చనిపోవడానికి మాత్రమే అనుకుంటే పొరపాటే, ఏ కారణంలేనిది దేవాధిదేవుడు మానవులను సృష్టించ లేదు. లోకములో ఉన్న ప్రతి మానవుడు కారణ జన్ముడే. మనం ఏ పని చేసినా దానికి కారణం అంటూ

ఉంటుంది. కారణం లేనిది ఏ పని చేయలేము, మనం చేసుకునే ఈ జీవనానికి సంబదించిన సాధారణమైన పనులకే బోలెడు కారణాలు ఉన్నప్పుడు దేవుడు సృష్టించిన వింతైనటువంటి మన జన్మకు ఏ కారణం లేదా? కారణం లేనిది దేవుడు మనుషులను ఎందుకు సృష్టిస్తాడు? అంతుచిక్కని అందమైన ప్రకృతిని ఎందుకు సృష్టించాడు? ఎందుకు ప్రకృతి ఒడిలో మనిషిని చేశాడు?

అందరు తనలాగే అనగా దేవునిలాగే పరిశుద్దులుగా నిర్ధోషులుగా బ్రతికి దేవుడున్న మహాలోకమైన ఆ స్వర్గలోకం వెళ్ళాలనే కదా! ఇలా దేవుని పట్ల మనిషికున్న అభిప్రాయమును గూర్చి ఎవరితోనైన మాట్లాడితే ఎందుకులే బ్రదర్... ఇదంత ఆలోచిస్తే బుర్రపాడైపోతుంది అని చెప్పే వాళ్ళు అనేకులు ఉన్నారు. వ్యర్థంగా గడిచిపోతున్న బ్రతుకును గూర్చి క్షణమాత్రం కూడా ఆలోచించక తమ మేధస్సును మేల్కొనే అవకాశం ఇవ్వక జీవితాన్ని సహజంగా తీసుకుంటున్న మానవజాతికి ఖచ్చితంగా కళ్ళు తెరుచుకోవలసిన అవసరం ఉంది. ఎందుకంటే మరణం అందరికీ సంభవిస్తుంది. మానవ

జన్మతో లోకములో ప్రవేశించిన ఈ నరుడైన జీవాత్ముడు ఎంతటివాడైన ఎవరికి భయపడని వాడైన మరణం పేరు వింటే చాలు అతని గుండెల్లో రైలు పరుగెత్తాల్సిందే మరణమంటే అందరికి భయమే.

ఎన్ని సంఘటనలు జరిగినా, ఎంతటి నష్టం వాటిల్లినా, ఎన్నిచేదు వార్తలు విన్నా తగుమాత్రపు బాధపడతాము. కానీ అన్ని విషయములకంటే ఎక్కువ దు:ఖం, భయం, బాధ, వేదన, రోదన, జ్ఞాపకం, బెంగ మరణమును గూర్చిన వార్త వింటేనే కలుగుతుంది. బ్రతికి ఉన్నన్ని రోజులు ఏ విషయం గూర్చి అంతగా మాట్లాడకున్నా మరణించే వారిని గూర్చి మాత్రం శత్రువైనా సరే జ్ఞాపకంచేసుకుంటు అదోలా ఆలోచిస్తాడు. ఎందుకంటే మనం కూడా ఏదో ఒక రోజు మరణం రుచిచూడాల్సివుంది కదా అనే భావంతోనే కావచ్చు.

మరణం అందరికి సంభవిస్తుందని తెలిసి కూడా మరణం తరువాత వెళ్ళబోయే ఆ పాతాళలోకమును గూర్చి ఎవరు సరిగ్గ చెప్పక ఉన్నారంటే మనకు జ్ఞానం నేర్పుతున్న పెద్దలకి, పండితులకు, బిషప్‌లకు, ఫాదర్‌లు, బాబాలు

మరియు స్వాములకు, సమస్త మానవాళి పుట్టుకయొక్క పరమార్థం గూర్చి తెలియదనే చెప్పాలి. మనకు జ్ఞానాన్ని నేర్పే వాళ్ళే సరియైన మార్గాన్ని సరిగ్గా పట్టుకోలేనప్పుడు వారిని నమ్మి వెంబడిస్తున్న జనారాణ్యానికి జీవమార్గం ఎలా తెలుస్తుంది? తెలియకనే జనులు తమ హృదయాలలో దేవునికి సరిగ్గ చోటివ్వక దేవుడున్న మహాలోకమైన స్వర్గానికి (పరలోకానికి) దూరం అయి అగ్ని ఆరని ఆత్మ చావని స్థలానికి వెళ్ళిపోతున్నారు.

మనిషి జన్మ ఎందుకు? అని చాలా మందిని అడిగితే ఇంకెందుకు..? తినడానికి త్రాగడానికి ఎంజాయ్ చేయడానికి అని వెట్టిగా వాగే వాళ్ళే కనిపిస్తున్నారు. ఇలా దిక్కు తెలియక అయోమయం అవుతున్న నరులకి ఒక్క దేవుడే ఆధారం. మనుషుల పుట్టుక పరమార్థం ఏ మనిషి కూడా చెప్పలేడు. ఎందుకంటే మనిషి నమ్ముకున్నది తన స్వబుద్ధిని. దీని గూర్చి ఒకే ఒక వ్యక్తి చెప్పగలడు. ఆయనే మనలను కన్న పరమతండ్రియైన దేవుడు.

దేవుడు అను పదము వినే సరికి " ఏ దేవుడు"? హిందువుల దేవుడా? ముస్లింల దేవుడా? క్రిస్టియన్‌ల

దేవుడా? అనే చిక్కు ప్రశ్న లేక అనుమానం మనలో రావచ్చు ఎందుకంటే కులానికో దేవుడు, మతానికో దేవుడు, జాతికో దేవుడు ప్రాంతానికో దేవుడని చెప్పిన మట్టిమెదడును నమ్మి కొట్టుమిట్టాడుతున్న లోకం మనది. దేవునిని మనిషికో రీతిగా విడగొట్టి దేవున్ని దేవునిగా ఎరుగక ఉన్న పరమ దుర్మార్గపు సమాజం మనది. అందుకే లోకంలో ఏ విషయంలో అంతగా గొడవలు జరగకున్నా దేవుని విషయంలో మాత్రం ప్రతిరోజు చర్చలు గొడవలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి.

అసలు దేవుని గూర్చి చెప్పాలంటే మంచివారి మీదను, చెడ్డవారిమీదను, నీతిమంతుల మీదను, అవినీతిమంతులమీదను, సమానంగా వర్షాన్ని కురిపిస్తూ పోషిస్తున్న పరమాత్ముడు పరిపూర్ణుడే ఆ దేవుడు. దేవునికి ఏ ఆకారము లేదు ఆయన అదృశ్యుడు, నిరాకారుడు, ఆయన ఆత్మ (కంటికి కనిపించనివాడు, కనిపిస్తే ఏ నరుడు బ్రతక లేనంతంటిగా శక్తిని కలిగియున్న సర్వ శక్తిమంతుడు) ఇంకా చెప్పాలంటే ప్రేమ స్వరూపి, ఏ పాపములేని పరిశుద్ధుడు, పవిత్రుడు, సర్వోన్నతుడు, నానా

భాషలలో నానా విధాలుగా పరమాత్ముడని, దేవుడని పరమాతండ్రియని, పరమేశ్వరుడని, పైనున్న వాడని, సబ్‌కా మాలిక్ ఏక్ అని, అందిరినోట గొప్పగా పిలువబడుతున్న ఆపైనున్న వాడే (ఊపర్‌వాలా) సర్వమానవాళిని కన్నతండ్రియైన దేవుడు.

ఆయనకు లింగబేధం (ఆడ, మగ లాంటి) బేధం లేదు. గాలి ఒక అదృశ్యశక్తి దానికి లింగబేధము ఉండదు. అలాగే ఆకాశం, సూర్యచంద్ర నక్షత్రాలు, నీరు, అగ్ని, వృక్షాలు, నేల ఇవి ఎలాగైతే లింగబేధము లేని శక్తులో, దేవుడు కూడ లింగబేధము లేని సర్వాన్ని సృష్టించిన అదృశ్య సర్వశక్తిమంతుడు, స్వయంభువుడు అమరుడు అందరికంటే ముందున్నవాడు ఆది-అంతము లేనివాడు మొదటివాడు తరతరముల నుండి ఉన్నవాడు. ఆయనకి మనకున్నట్టు పేర్లు, ఊర్లులేవు.

ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను అందరిగా వ్యాపించి ఉన్నాడని మానవాళి బ్రతుకు పుస్తకము, జీవ గ్రంథము అయిన బైబిల్‌లో వ్రాయబడి

ఉంది. బైబిల్ పేరు వినగానే ఏ పుస్తకము గూర్చైనా చెప్పండి కాని బైబిల్ గూర్చిమాత్రం అస్సలు చెప్పకండి. అది తక్కువ కులము వాళ్ళది, తక్కువ జాతి వాళ్ళది అని, కుల మత బేదాలను ఆధారము చేసుకొని బైబిల్‌ను ఇష్టపడని వారు, విమర్శించే వారు మరియు వినడానికి, చదువడానికి కూడా కఠినంగా ఉంటుందని పొరపాటు పడేవారు మనలో చాలామంది ఉన్నారు.

అయినాకాని మన మనుష్యాత్మలను నరకానికి వెళ్ళకుండ తప్పించి దేవుని యొద్దకు (స్వర్గానికి) తీసుకెళ్ళె ఎకైక గ్రంథము బైబిల్ అని ఎంత మందికి తెలుసు? తినడానకి చేదుగా ఉంటుందని మనం తినే కాకరకాయను తినడం మానతామా? రుచిలో చేదుగా ఉండోచ్చు. కాని అదే ఆరోగ్యానికి సొత్తు. మందు మాత్రలు చేదుగా ఉంటాయని రోగమొస్తే మందులు వేసుకోవడం మానుతామా? అవి చేదుగా ఉన్నా, మనలోని రోగాన్ని నిరోదిస్తాయి. ఇంజక్షన్ నొప్పిగా ఉంటుందని డాక్టర్ దగ్గరికి వెళ్ళడం మానతామా? నొప్పిగ ఉన్న పర్వాలేదు

ముందు డాక్టర్ దగ్గరికి పోవాలి అని పరుగెత్తుతూ ఆరోగ్యం గురించి తీవ్రంగా ఆలోచిస్తాం.

బైబిల్ కూడా చదవడానికి కొంచెం కష్టంగా ఉండొచ్చు కాని మానవుల పాపమును కడిగి పరిశుద్ధ పరచే గ్రంథము బైబిల్ అని వాస్తవాన్ని మనసుపెట్టి ఆలోచిస్తే అద్భుతంగా అమోఘంగా ఉంటుంది. బైబిల్ మానవుల కల్పిత పుస్తకమని అనేకులు అపార్థంగా ఆలోచన చేసుకుంటున్నారు. కాని బైబిల్ గ్రంథం మనుషుల ఊహలతో వ్రాసిన పుస్తకం కాదని అది ఒక కులానికి లేక మతానికి సంబంధించిన గ్రంథం కాదని మానవులందరి బ్రతుకు పుస్తకమని గ్రహించేవారు కరువయ్యారు. బైబిల్ గ్రంథమును మనందరిని సృష్టించిన ఆపైనున్న పరమాత్ముడే తన ప్రియులైనమనుషుల ద్వారా తన ఆత్మను అనుగ్రహించి వ్రాయించాడని అదే బైబిల్ చెబుతుంది.

“ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదటలో

గ్రహించుకొనవలెను, ఏలయనగా ప్రవచనము ఎప్పుడు మనుష్యుని ఇచ్చను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ, (దేవుని ఆత్మ) వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 2:20) దేవుని ఆత్మ ప్రేరణతో వ్రాయబడిన ఈ జీవ గ్రంథము, భవిష్యత్ జ్ఞానియైన దేవుడు లోకమును పుట్టించక ముందే తన అనాది సంకాల్పాన్నిబట్టి నిర్ణయించుకొని మానవులకు తన స్వరూపమును ఇచ్చి, తనకోసం తనలాగే పరిశుద్ధులుగా, నిర్దోషులుగా నీ లోకంలో జీవించడానికి ఓ ఆకారమును నిర్మించాడని చెబుతుంది. ఇది ఒక కుల గ్రంథమో లేక మత గ్రంథమో అస్సలు కాదు. మానవాళి అందరి బ్రతుకు పుస్తకము అని తెలియని అమాయకులు దీనికి విదేశీ మత గ్రంథం అని ముద్ర వేశారు. కావాలంటే మీరే చదవండి ఈ క్రింది వాక్యాన్ని.

"మరియు యావద్భూమి మీద కాపురముండుటకు దేవుడు యొకనినుండి ప్రతిజాతి మనుషలను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడువులాడి కనుగొందురేమోయని,

తన్ను వెదుకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాసస్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. (అపొ.కా. 17:26) ఈ వాక్యంలో దేవుడే ప్రతిజాతి మనుషులను సృష్టించాడు అని వ్రాయబడి ఉంది కదా! అలాంటప్పుడు మనమెందుకు కులానికి మతానికి సంబందించని జాతిని ఎందుకు సృష్టించకూడదు? అని మనకు సందేహం రావచ్చు.

దేవుడు సృష్టించిన ప్రతిజాతి మనం అనుకునే జాతికాదు. జాతి అంటే వర్ణానికి, ముఖపోలికలకు, సాంప్రదాయానికి సంస్కృతికి సంబందించింది, ఎలా గంటారా? అనేక దేశాలలో అనేక ప్రాంతలలో అన్ని రకాల మనుష్యులున్నారు. ఎర్రగా, నల్లగా, తెల్లగా, పొట్టిగా, ఎత్తుగా ఉండి రకరకాల ముఖపోలికలతో ఉంటు చలిస్తున్న జాతే ఈ మనుష్యజాతి. ఉదా॥ ఆమెరికాలో ఉన్న మనుషులు ఎర్రగా ఎర్రని జుట్టుతో కొందరు సున్నితమైన శరీరంలో తెల్లని జుట్టుతో కూడా కనిపిస్తారు. అదే జపాన్‌లోని నివాసులు పొట్టిగ ఉండి

గుండ్రని ముఖంతో ఎర్రగా చిన్న చిన్న కళ్ళతో కనిపిస్తారు. అదే విధంగానే వెస్టిండీస్‌లోఉన్న మనుషులు నల్లగా విడివిడిగా ఉన్న ఉంగరాల జుట్టుతోఎత్తుగా కండలుతిరిగి బలంగా కనిపిస్తారు. అంతెందుకు మన భారతదేశం గూర్చి ఆలోచిస్తే ఇంకా బాగుంటుంది.

మనుదేశంలోని మనుషులలో అనేక జాతులు న్నాయి. అస్సాంలో పొట్టిగ ఎర్రగా కనిపిస్తారు. అదే కేరళలో అయితే ఎర్రగ ఉండి గుండ్రని మొహంతో నుదుటిపైన చక్కని బొట్టుతో సాంప్రదాయమును పాటించే స్త్రీలు ఉండగా, పంచ కట్టుకునే స్త్రీలు పురుషులు కూడా ఉన్నారు. మన ఆంధ్రప్రదేశ్‌లోనైతే నల్లగ తెల్లగా ఉండి చీరలుకట్టుకుని నుదుటిపైన సాంప్రదాయమైన బొట్టు మంగళసూత్రం, కాళ్ళకు మట్టలు వేసుకునే స్త్రీలు ఉండగా, ప్యాంటు షర్టు వేసుకునే లక్షణముగా కనిపించే పురుషులు మనలో ఉన్నారు. ఇలా అనేక ప్రాంతాలలో అనేక విధాలుగా వేరువేరు రంగులతో వేరువేరు ముఖపోలికతో ఉండి తమ తమ సాంప్రదాయాన్ని

సంస్కృతిని పాటించే మనుష్య జాతియే దేవుడు సృష్టించిన ప్రతిజాతి. ఇది దేవుడు సృష్టించిన వాటన్నిటిలో చాలా మంచిది పవిత్రమైనది.

దేవుడు సృష్టించిన ఈ విధమైనటువంటి "ప్రతిజాతి"ని సరిగ్గ అర్థం చేసుకోక మానవులు తమ స్వబుద్ధిని నమ్మి వారికి తోచిన విధంగా కులాని మతానికి సంబందించిన జాతిని సృష్టించుకొని తమ స్వకీయ నాశనానికి గురై తమను తాము బలంగా మరిచిపోవడమే కాక లోకములో ఉన్న హేయమైన పాపపు ఉచ్చులో చిక్కుకొని తమ గమ్యాన్ని గుర్తించలేనంతగా శరీరేచ్ఛలకు గురైపోయారు. ఎప్పుడైతే ఇలా దుష్టశక్తికి బానిసలయ్యారో అప్పటినుండి లోకములో ఉన్న శరీరాశ, నేత్రాశ, జీవపు డంబమునకు పూర్తిగా లోబడి తమ హృదయాలలో సాతాను ముద్ర వేసుకున్నారు.

అలా సాతానుముద్రవేసుకొని ద్వేషములతో ఒకరంటే ఒకరికి పడని స్థితికి చేరి, కలహములతో కలం కలం రేపుతూ, మత్సరములతో కీడుచేయుడానికి

పరుగులుతీస్తూ, క్రోధములతో మృగముగా మారి హీనంగా ప్రవర్థిస్తు, కక్షలతో ప్రాణాలు తీస్తూ బేధములతో గొడవలను సృష్టిస్తూ, తమ అభిమతములతో మతాన్ని సృష్టించి ఒక మత మంటే మరో మతానికి పడక మతోన్మాదిగా మారి ఉగ్రవాదులుగా జీవిస్తూ, అభిచారములతో, హింసాత్మకమైన హేయ కార్యములు చేస్తు, మత్తులతో మద్యానికి గురై మతంమత్తు అనే మాయలో పడిపోయారు.

ఇలా ఒక్కరా? ఇద్దరా? అందరు పాపానికి దాసులైపోయారు. ఇవే కాకుండ లోకాన్ని అత్యధికంగా శాసిస్తున్న కామం వలలోపడి కామాంధులుగా మారి తమ స్వరూపాలకు ఉన్న ఔన్నత్యాన్ని మరిచి సినిమా టాకిస్‌లలో, పార్కులలో, క్లబ్‌లలో, హీనాతిహీనంగా కాముకత్వాన్ని తీర్చుకుంటు వ్యభిచారం, జారత్వములను జరుపుకుంటూ, తమ కామ కోరికలను నిర్లజ్జగా తీర్చుకుంటున్నారు. సమాజాన్ని పరిశీలిస్తే లోకంలో అధికంగా జరుగుతున్న హేయం కామమే.

ఇలా మనుషులందరు నానా విధాలుగా పాపపు చీకటిలో పడి పాపముతోనే మరణిస్తున్నారు. మరీ మరణించాక ఎక్కడికి వెళ్తున్నారో ఇక మీరే జాగ్రత్తగా బైబిల్ చదవండి.

"ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్ని గుండంలో పడవేయ బడెను." వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పు పొందెను. మరణమును మృతుల లోకమును అగ్ని గుండములో పడవేయబడెను. ఈ అగ్ని గుండం రెండవ మరణం? (ప్రకటన 20:13-15). మనకు ఈ లోకసంబంధమైన మరణమే తెలుసు. ఇదే మరణమని మనిషి అంతం లేదా మరణంతోనే అవుతుందని ఇంతవరకే తెలుసు. కాని ఇక్కడ మరణించిన తరువాత ఏడుస్తూ, పండ్లుకొరుకుతూ, వేదన పడుతూ, యాతన పడుతూ, ఇక ఎన్నడుబయటికి తిరిగిరాని లోకమైన అగ్ని గుండంలో కలకాలం మండుతూ, కేకలు వేస్తు అలాగే ఉండిపోయే అసలైనటువంటి రెండవ మరణం గూర్చి తెలియదు. అక్కడ ఎంత కేకలు వేసినా అంతం లేని

మరణంతో మరణించక, బయటికి రాక విలవిల కొట్టుకుంటూ అక్కడే ఉండిపోయే మరణమే దేవుడు మానవాళికి తీర్చే తీర్పు. అదే అగ్నిగుండం (నరకం).

ఆ అగ్ని గుండానికి ఎన్నటికీ ఆరిపోయే గుణం లేదు, అది ఆరక ఆత్మలై యున్న మనము చావక అలాగే ఉండి పోయే మరణం గూర్చి ఆలోచిస్తే, ఎన్నడు చెందని భయం మనలో పుట్టక తప్పదు.

పాపముతో మరణించిన ప్రతివారు ఇదే అగ్ని గుండంలో నరకంలో కాలిపోతున్నారు. ఎలా యాతన పడుతున్నారో మనం కూడ అక్కడ ప్రవేశిస్తే, ఎలా యాతన పడుతామో అక్కడ మన పరిస్థితి ఎలా ఉంటుందో వాక్యమైయున్న క్రీస్తుబోధను చూడండి.

"నీవు ప్రవేశించుచుండగానే నిన్ను ఎదుర్కొనుటకై క్రింద పాతాళం (అగ్ని గుండం) నీ విషయమై కలవర పడుచున్నది" (యెషయా 14:09). ఏదైనా తినే వస్తువు చూస్తే తినడానికి మననోరు ఎలా ఊరుతుందో అలాగే మనలను అనగా మన ఆత్మలను కాల్చడానికి

ఆ పాతాళములోని నరకం మనలను ఎప్పుడు కాల్చాలి? ఎలా కాల్చాలి? అని కలవర పడుతుంది.

"అది నిన్ను చూసి ప్రేతలను రేపుచున్నది" ప్రేతలంటే ఎవరో కాదు. మనకంటే ముందుగా చనిపోయి అక్కడ పాతాళంలో యాతన పడుచున్న వారు. "భూమిలో పుట్టిన సమస్త శూరులును జనముల రాజులనందరిని వారివారి సింహాసనముల మీద నుండి లేపుచున్నది." మేము వీరులము, శూరులము, రాజులము అని మాదిపెద్ద జాతి, మాదిపెద్దకులం పెద్దమతం అని అహంకార స్వభావంతో మనుషుల మధ్య గొప్పగొప్పగా పేర్లు చెప్పుకుంటూ తమకు ఇష్టానుసారంగా పాపముతో బ్రతికి చనిపోయిన వారందరు నరమనే ఆ అగ్నిగుండంలో కాలుతూ కనిపిస్తారు.

"వారందరు నిన్ను చూసి నీవును మావలే బలహీనుడవైతివా? నీవును మాబోటివాడవైతివా? అందురు". మేమేదో మూర్ఖంగా ప్రవర్థించిఎవరు చెప్పినా వారి మాటలువినక దైవచిత్తాన్ని తెలుసుకొనక ఈనరకానికి వచ్చాం. ఆ బోధ ఏదో మేము అనుభ

విస్తున్నాం నీకేమయ్యింది? నీకెవరు దేవుని తీర్పుగురించి చెప్పలేదా? చెప్పినా నీవు కూడా మాలాగా వినుపించుకొని బలహీనుడవైతివా? మాబోటివాడవైతివా? అని కేకలు వేస్తూ అందురు. అప్పుడు "నీ మహత్మమును నీ స్వర మండలముల స్వరమును పాతాళమున పడవేయబడెను. నీ క్రింద పురుగులు వ్యాపించును కీటకములు నిన్ను కప్పును" (యెషయా 14:9).

అక్కడ ఏడ్పును పండ్లు కొరకుడును తప్ప ఏమి ఉండదు. ఇంతటిభయంకరమైన శిక్షకు గురి కావడం మనకు న్యాయమా? లేక మరణించక ముందే మన పాపములు దేవుని యెదుట ఒప్పుకొని క్షమాపణ పొంది దేవుడున్న మహాలోకమునకు అనగా పరలోకమైన స్వర్గానికి వెళ్ళడం న్యాయమా? అని నిర్ణయించుకోవలసిన అవసరం ఉంది గనుక దేవుడు మన ముందు రెండు మార్గాలు పెట్టాడు. అందులో 1. స్వర్గం (బైబిల్ బాషలో పరలోకం) అంటే పరమాత్ముడున్న లోకం. 2. నరకం అనగా పాపాత్ములను కాల్చడానికి దేవుడు పెట్టిన

అగ్నిగుండం (బైబిల్ భాషలో పాతాళాం) చాలామంది పాతాళానికిగురి అవుతారని ముందే ఎరిగిన భవిష్యత్ జ్ఞానియైన దేవుడు ఈ జగత్తుకు పునాది వేయబడక ముందుగా మానవాళి మేలును కోరి అందరి పాపక్షమాపణనిమిత్తము బలి ఇవ్వడానికి తన ప్రియ కుమారున్ని ఏర్పర్చుకొని ఇశ్రాయేలీయుల కాలము పరిపూర్ణమైన తరువాత తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తుకు మనలాంటి శరీరాన్ని ఇచ్చి దివినుండి భువిలోనికి పంపాడు. పాపం క్షమింపబడాలి అంటే పరిశుద్ధమైన బలి కావాలి గనుక తన సొంత కుమారుని రక్తమును చిందించి మన పాపములను విమోచించడానికి ఆయనను పాపశరీర ఆకారముతో (రోమా 8:1-4) పంపాడు.

"ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకు అనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్త ప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా

(పిల్లలనుగా) స్వీకరించుటకై మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్ధోశులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక ముందే ప్రేమచేత దేవుడు క్రీస్తులో మనలను ఏర్పరుచుకొనెను" (ఎఫెసి 1:4-6). "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను" (గలతి 4:4). యేసుక్రీస్తు ఈ లోకములో ప్రవేశించిన తరువాత దేవుడు తన గురించి వ్రాసిన ప్రకారము జీవించి, దేవున్ని ప్రకటించి మన పాపముల కొరకు ఆయన ప్రేమను మరణంతో వెదజల్లి తిరిగి లేచి దేవుని యొద్దకు చేరి మనందరికి మార్గమయ్యాడు.

"యేసు-నేనే మార్గమును సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" "నేను తండ్రియైన దేవుని యొద్దనుండి బయలుదేరి లోకమునకు వచ్చియున్నాను". మరియు లోకమును విడిచి తండ్రి యొద్దకు వెళ్ళుచున్నాను అని వారితో చెప్పెను." (యెహాను సువార్త 14:66-16:28) ఇలా

తన శిష్యులకు మార్గాన్ని తెలియజేసి లోకపాపంకొరకు తన ప్రాణం పెట్టి తిరిగి లేచాడు.

"అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15:3-4). మరణించి తిరిగిలేచి తన శిష్యులకు కనిపించి "వారు లేఖనములు గ్రహించు నట్లుగా ఆయన వారి మనుస్సును తెరిచి, క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు, యెరుషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరిట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింప బడుననియు వ్రాయబడియున్నదని చెప్పి వారు చూచుచుండగా ఆయన పరలోకమునకు, అనగా దేవుని కుడిపార్శ్వమునకు ఆరోహణమాయెను.

అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను ఆయన వెళ్ళుచుండగా వారు ఆకాశము వైపు తేరి చూచుచుండిరి". ఇదిగో తెల్లని

వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు (దేవదూతలు) వారి యొద్దనిలిచి మీరెందుకు నిలిచి ఆకాశమువైపు తేరిచూచుచున్నారు? పరలోకమునకు చేర్చుకొనబడిన ఈ యేసే, యేరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారికి చెప్పెను. (లూకా 24:45–47; అపొ.కా. 1:9–11).

అలా మన పాపముల నిమిత్తము తన పవిత్రమైన రక్తాన్ని చిందించి చనిపోయి పాతాళానికి వెళ్ళి తిరిగిలేచి పరలోకమునకు (స్వర్గానికి) ఎక్కిపోయాడు. అదే వాక్యంలో వ్రాయబడిన ప్రకారం యేసుక్రీస్తు మరలా ఈ భూలోకానికి వస్తాడు. ఎప్పుడంటే లోకపాపం పండిపోతే ఈలోకం అంతటిని అంతం చేయడానికి మరియు తనను నమ్మిన వారిని పరలోకం తీసుకెళ్ళడానికి మాత్రమే వస్తాడు. ''ఆర్భాటముతోను, ప్రధాన శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును (1థెస్స 4:16). అప్పుడు యేసుక్రీస్తు సూచన ఆకాశమందు కనబడును.

"అప్పుడు క్రీస్తు ప్రభావముతోను, మహిమతో, ఆకాశ మేఘారుడుడై వచ్చుట చూచి భూమిమీద ఉన్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకుందురు మరియు ఆయన తన దూతలను పంపును. వారు ఈ చివరి నుండి ఆ చివరి వరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పర్చు కొనిన వారిని పోగు చేతురు. (మత్తయి 24: 30,31). అదే లోకానికి అనగా ఈ సృష్టికి చిట్టచివరి తీర్పుదినము. ఒకసారి మానవాళిని తమ పాపం నుండి విమోచింప జేయడానికి వచ్చాడు అదే మొదటి రాకడ.

ఈసారి (రెండవ రాకడ) ఈ లోకపాపం భరించక పాపులైన మనుషులను కడతేర్చడానికి వస్తాడు. అప్పుడు "క్రీస్తు నుండి మృతులైన వారు మొదట లేతురు" (1థెస్స 4:16). అప్పుడు నీతి మంతులు క్రీస్తుతో దేవుని యొద్ద పరలోకములో ఎల్లప్పుడు నివాసం చేస్తారు. ఇకపోతే పాపాత్ములు ఆరని అగ్ని గుండంలో పాతాళంలోని నరకంలో పడద్రోయబడతారు. "ఏలయనగా పాపము వలన వచ్చు జీతం మరణం (రోమా 6:23) ఆ రెండవ

మరణమే అగ్నిగుండం". అక్కడ అగ్ని ఆరదు మన ఆత్మ చావదు. ఇది పచ్చి నిజం పరమ దేవుని దేవోక్తి.

ఆ తీర్పు దినము ఎప్పుడు వస్తుందో, దేవుడు ఆ దినం గూర్చి మనకు తెలియకుండ రహస్యంగా పెట్టాడు. "అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రియైన దేవుడు మాత్రమే యెరుగును. కాని ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగడు (మత్తయి 24:31). "అందుచేత నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలో నుండి (పాపములలోనుండి) లెమ్ము క్రీస్తు నీమీద ప్రకాశింస్తు న్నాడని ఆయన చెప్పుచున్నాడు." "ఎందుకనగా పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను. (ఎఫెసి 5:14; 1తిమోతి 1:15) ఏ క్షణాన మనం మరణిస్తామో, మరణించి నరకానికి వెళాతామో మనకు తెలియదు.

గనుక అతి త్వరలో కళ్ళుతెరిచి మన పాపములను దేవుని యొద్ద ఒప్పుకొని, ఆయన ప్రియకుమారుడు ఈ లోకరక్షకుడైన యేసుక్రీస్తును మన పాపవిమోచకుడు

అని ఒప్పుకుంటే, ఎలాంటి అపరాధములతో, పాపములతో ఉన్నప్పటికీ యేసుక్రీస్తు మన పాపములను ఉచితంగా తన రక్తం ద్వారా పరిశుద్ధపరిచి దేవుని యొద్దకు పరిశుద్ధులుగా నిర్దోషులుగా చేసి దేవుడున్న స్వర్గానికి (పరలోకానికి) తీసుకెళ్తాడు. మన పాపములకు ఉచితంగా క్షమాపణ ఉందంటే, ఇంతకంటే ఎక్కువ సంతోషం ఎక్కడ దొరుకుతుంది.

ఇదంతా నిజమా? ఎవడు చూసివచ్చాడు అని అనుకుంటున్నారేమో. బాధపడితేగాని బోధపడుతుందనే సామెత గుర్తుకు తెచ్చుకోండి. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోవాలని గుర్తుంచుకొందాము. చనిపోయిన తర్వాత తెలుసుకొంటే లాభం లేదు. అప్పటికి అంతా అయిపోతుంది. అందుకే బ్రతికి ఉన్నప్పుడే ఈ బ్రతుకు తర్వాత అనగా చనిపోతే ఏమవుతుందో ముందే తెలుసుకొంటే మంచిది. మామూలుగా ఈ బ్రతుకులో రేపేమి జరుగుతుందో తెలుసుకోవడానికి జ్యోతిష్కులకు చాలా ఖర్చుపెడుతున్నారు. వారు చెప్పేది ఎప్పుడు జరుగదని మరచిపోతున్నారు.

కాని నిన్ను-నన్ను తన ఇష్ట ప్రకారం పుట్టించిన దేవుడే మనం చనిపోయిన తర్వాత ఏమి జరుగుతుందో కూడా మనం అడుగకముందే ఉచితంగా మనకు తన కృపద్వారా తెలియజేస్తున్నాడు. మరణం తర్వాత ఏమి జరుగుతుందో యేసుక్రీస్తు మనకు తానే మార్గమై చూపాడు. పరలోకం నుండి వచ్చి భూలోకంలో బ్రతికి చనిపోయి పాతాళలోకం వెళ్ళి, తిరిగి మూడవదినాన భూలోకానికి వచ్చి పరలోకం వెళ్ళాడు. ఇదే మనుషులందరికి జీవమార్గము. అందుకే స్వంత డబ్బును ఖర్చుచేసి మాకు తెలిసిన ఈ మేలు, లాభం మీకు తెలియజేయాలనే ఈ పుస్తకం మీ ముందుకు తెచ్చాను. ఈ సువార్తను నమ్మినవారందరికి రక్షణ, పరలోకం మరియు నమ్మని వారందరికి నిత్యాగ్ని దండన అని దేవోక్తి నిరంతరం బోధిస్తున్నది.

ఇదంతా అనగా నేడు మనము రక్షణలో ఉన్నామా? శిక్షణలో ఉన్నామా? అనేది మనం మరణిస్తేనే తెలుస్తుంది మరియు జరుగుతుంది. అయితే బ్రతికి ఉన్నవారికి ఈ సంగతి తెలియాలనే యేసుక్రీస్తు ప్రభువు లాజరు -

ధనవంతుని గాథ (చరిత్ర) ద్వారా మనకు వివరించాడు (లూకా 16:19–31). ఇది కథకాదు సుమా ఎందుకంటే వారు జీవించిన కాలము మోషే, ప్రవక్తలు జీవించిన కాలము మరియు వారి భూ భాగములో జరిగినది. దేవుడు తన కుమారుడైన క్రీస్తు ద్వారా తెలిపిన సత్యము మనందరిలోని భయాన్ని పోగొట్టింది కూడా.

సోదరా, సోదరి దీనిని నీవు నమ్మినా నమ్మక పోయినా, ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా, నీవు అవునన్నా కాదన్నా, "యేసుక్రీస్తు అందిరికి ప్రభువు." "యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులునుగా చేయును" (1యెహను 1:5–7). గనుక మన పాపమును దేవుని కుమారుడైన యేసు క్రీస్తు నామములో ఒప్పుకుంటే "నేను వారి దోషముల విషయమై దయకలిగి వారి పాపములను ఇక ఎన్నడును జ్ఞాపకం చేసికొనునని ప్రభువు సెలవిచ్చుచున్నాడు". ఎందుకనగా "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు

దేవుడు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16).

మన దేశంలో చాలామంది యేసుక్రీస్తు గూర్చి తెలియక ఆయన కేవలం ఇశ్రాయేలీయుడని, విదేశి మతాన్ని సృష్టించాడని పొరపాటు పడుతున్నారు. యేసు బ్రతికి ఉన్నకాలంలో ఎప్పుడు ఏ మతాన్ని ప్రకటించలేదు. పాపపు ఉచ్చులో చిక్కుకుని పాపములకు అపరాధములకు లోనయిన వారి మనుస్సును మార్చుకోమన్నాడే గాని మతాన్ని మార్చుకో మనలేదు. మరియు ఆనాటి మత పెద్దలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు (మత్తయి 23వ అధ్యాయం). ఎందుకంటే దేవుని మార్గం ఎన్నడూ మతం కాదు. కానేరదు. దేవుని మార్గం జీవమైయుంది.

ఇది తెలియని వారు ఈ లోక మతాల మత్తులో మునిగి భ్రమపడి పొరపాటు పడుతున్నారు. ఆయన ప్రకటించిన వాక్యములను లోతుగా ఆలోచిస్తే, యేసు ప్రకటించింది మతమా? మార్గమా? అనేది తెలుస్తుంది. మనుషులను దానవత్వము నుండి మానవత్వము వైపు తిప్పి, దేవత్వములోనికి తీసుకెళ్ళేదారిని మతమన్నవాడు మతిలేని దుర్మార్గుడు కాదా!

“ఆయన ఆ జనసమూహమును చూచి కొండయెక్కి కూర్చుండగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చిరి. అప్పుడాయన నోరుతెరిచి ఈలాగు బోధింపసాగెను.

**ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు, పరలోకరాజ్యము వారిది; దు:ఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురు.**

**సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు.**

**నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తి పరచబడుదురు.**

**కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు.**

**హృదయశుద్ధిగలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు, సమాధానపరుచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.**

**నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది.** మత్తయి (5;1-10)

"నరహత్య చేయవద్దు; వ్యభిచారం చేయవద్దు; నేను మీతో చెప్పునదేమనగా ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారం చేసిన వాడగును." (మత్తయి 5;21-28)

పైనున్న వాక్యములలో ఎక్కడ మతమును గూర్చి బోధించలేనప్పుడు యేసు ఎలా మతాన్ని సృష్టించిన వాడవుతాడు? యేసు ఇశ్రాయేలు దేశంలో ఎందుకు జన్మించాడంటే అది దేవుడు వాగ్దానము చేసిన భూమి. తన కుమారుని బలి వాగ్దాన ప్రకారము అక్కడే జరగాలి, అందుకు యేసు ఇశ్రాయేలు దేశంలో జన్మించాడు.

దేవుడు మొట్టమొదటగా మట్టితో మనిషిని సృష్టించి తరువాత అతనిలోనుండే తీసిన యెముకతో స్త్రీని సృష్టించింది కూడా ఆ ప్రాంతాలలోనే, అలా ఆ ప్రాంతాలలో సృష్టింపబడిన మొదటి దంపతులతోనే ఈ భూలోకమంత నిండిపోయింది. అలా మనమంతా విస్తరించి ఈనాడు మనదేశమైన భారతదేశంలో ఉన్నాము.

దేవుడు మొదటగా ఎక్కడైతే నరుడు మరియు నారిని చేశాడో ఎక్కడైతే వారు దేవుని ఆజ్ఞను మీరి పాపంచేసి ఆయనకు దూర మయ్యాడో అదే పరిసర ప్రాంతాలలో యేసును బలి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఈ కార్యము జగత్తుకు పునాది  వేయబడక ముందే చేయాలని నిర్ణయించుకొని సృష్టి తర్వాతనే మనుషులను సృష్టించాడు. ఇశ్రాయేలీయుల కాలము పరిపూర్ణము అయిన తరువాత క్రీస్తును ఈ లోకానికి పంపించి పాపులను క్షమించడానకి సర్వ అధికారం ఆయనకు ఇచ్చి మన పాపముల నిమిత్తము ఆయనను బలిగా అర్పించాడు. ఇది దేవుని చిత్తము ఆయన తన సంకల్పం ప్రకారము అన్నీ క్రమముగా జరిగించాడు. మనకు ఈయనయందే పాపక్షమాపణ లభిస్తుంది. లేదంటే "నరకమున వారి ఆత్మచావదు అగ్ని ఆరదు" (మార్కు 9;48) అని ఆ దేవుని వాక్కము హెచ్చరిస్తుంది.  మనము పాపముతోనే మరణిస్తే నరకంలో శిక్షను తప్పించు కోలేము. మరణించకముందే మన పాపములను

ఒప్పుకుంటేనే మరణించిన తర్వాత పరలోకంలో నిత్యజీవానికి వారసులవుతాం.

అనేక ప్రజలు పాపమునకు అర్థం తెలియక మాలో పాపం లేదు. మేము పాపులముకాము అని వాదిస్తున్నారు. అలా గనుక మనం అనుకుంటే మోసపోక తప్పదు. మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము. మరియు మనలో సత్యముండదు. మనపాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మనపాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము. మరియు ఆయన వాక్యము మనలో ఉండదు'' (1యెహాను1;8-10).

మనలో ఈసత్యము ఉండాలంటే మన పాపములను ఒప్పుకొని క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించాలని

దేవునివాక్యము సెలవిస్తుంది. "కుమారుని ఒప్పుకొనువాడు తండ్రిని అంగీకరించువాడు. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని, యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది. యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు. యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో వానిలో దేవుడు నిలిచియున్నాడు. వాడు దేవుని యందున్నాడు."

"మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను. మనము దేవుని దేవుని ప్రేమించితిమని కాదు. తానే మనలను ప్రేమించి మనపాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమయున్నది (1యోహాను2:22,23; 4:2,3,9,14).

అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరుచుచున్నాడు? ఏట్లనగా మనమింక పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

కావున ప్రియసోదరా! సోదరి! ‘‘ఇందుకు ప్రమాణముగా వ్రాయబడినదేమనగా నీతిమంతుడు లేడు. ఒక్కడును లేడు? (రోమా 3:10) గనుక అందరికి కావాలి యేసురక్తము. అందరికి తండ్రియైన దేవుడు తన చిత్తప్రకారము మానవులందరికి తన స్వరూపమైన దైవస్వరూపము ఇచ్చి సృష్టిస్తే, మనుష్యులందరు దుష్టశక్తి వలలో పడి తమను తాము మరిచిపోవడమే కాక తమకు దైవ స్వరూపమును ఇచ్చి సృష్టించిన దేవున్నే మరిచి దయ్యపు రూపంలోనికి మారారు. గనుక మరలా యేసుక్రీస్తు ద్వారానే మనము కోల్పోయిన దైవస్వరూపాన్ని తిరిగి ఇచ్చి పవిత్రులుగా చేసి తన యొద్దకు తీసుకెళ్ళడమే ఈ భూమిమీద దేవుడు జరిగిస్తున్న నిజమైన దైవకార్యము. మనం కూడా చేయాల్సిన దేవునిపని, దేవునిసేవ, దేవుని పరిచర్య కూడా ఇదే. కావున బైబిల్ చెంతకు వచ్చి తిరిగి దైవములు అవడానికి ఇష్టపడుదాం.

IAS చదివతే కేవలం భూమి మీద బ్రతికినన్ని రోజులు మాత్రమే కలెక్టర్ అవుతాం.

MBBS చదివితే కొంతకాలం మట్టుకే డాక్టర్‌లు అవుతాం.

POLITICAL SCEINCE చదివితే కేవలం సానుకూల రాజకీయ నాయకులం మాత్రమే అవుతాం.

IPS చదివితే చిన్ని జీవనయాగములో పోలిస్ ఆఫీసర్‌లము మాత్రమే అవుతాం.

ఇవి కేవలం ఈ లోకంలో బ్రతకడానికి డబ్బును సంపాదించు కునే స్థానాలు లేదా మార్గాలు మాత్రమే.

వీటన్నిటికంటే గొప్పది దైవత్వము. దైవత్వ లక్షణం గురించి ఒక్క బైబిల్‌లోనే వివరంగా వ్రాయబడి ఉంది. గనుక బైబిల్ చదివి దాని ప్రకారం బ్రతికితే చనిపోయాక కలకాలం నిత్యజీవాన్ని స్వతంత్రించుకునే దైవములు అవుతారని గుర్తు చేస్తూ సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తూ...


మీ సహోదరుడు : **K. తిరుపతి**

ఇంద్రవెళ్ళి (గ్రా), అదిలాబాద్ (మం॥జిల్లా),

తెలంగాణ, ఇండియా ఫోన్ : **7893872620**

**ఇంకను మంచి అంశములు విని దైవ చిత్తాన్ని తెలుసుకోవాలను కుంటున్నారా? ఈ క్రింది చిరునామాకు రండి, వాక్యాన్ని ఒక్కసారైనా వినండి వాస్తావాన్ని పరిశీలించండి? దేవలోకాన్ని స్వతంత్రించుకొండి.**


**Dr. JOHN BONKURI,**

Director & Founder.

Institute of Bible Technology, Hyderabad &

Temples of God Meet Here Church Building,

# 06 - 264 / 13 / 1 / 6H, HAL/Raghavendra Colony,

Suchitra X Road to Quthbullapur Road,

Behind Indian Oil Petrol Punk, Quthbullapur (GHMC),

HYDERABAD - 500067, INDIA. Res Phone:+91 40 20000700, Mob: +91 9440142887

website : www.bibletechnology.net

www.instituteofbibletechnology.com

E-mail : bibletechnology@gmail.com



నీటిబుడగలాంటి మనిషి తన జీవితంలో
ప్రతిక్షణం, ప్రతిదినం రేపేమిజరుగుతుందో,
వచ్చేనెల, వచ్చేసంవత్సరం ఏమి జరుగ
బోతుందోనని తెలుసుకోవడానికి నానాయాతన
పడుతున్నాడు. జ్యోతిష్కులను సంప్రదించి
ఎంతో ఖర్చుచేస్తున్నాడు. కాని తాను ఈ భూమి
మీదకొచ్చాకనే తెలుసుకొన్నాడు ఈ లోకం
ఉందని, మరి దీనిని వదిలితే మరో లోకం
కూడా ఉందని తెలుసుకోనవసరం లేదా?
మన జీవితానికి ముందు, ఈ బ్రతుకులో,
ఈ జీవితం తర్వాత ఏం జరుగుతుందో
ఉచితంగా తెలుయజేసే సృష్టికర్త జ్ఞానమే

**"మరణం తర్వాత ఏమి జరుగును"**

అనే ఈ చిన్న పుస్తకం ఇష్టపడి చదవండి,
కష్టపడి అనేకులచే చదివించి వారికి
మార్గదర్శకులుకండి...

...మీ సోదరుడు
తిరుపతి కాంబ్లే